ప్రజాశక్తి

ఆదివారం 5 మార్చి 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

రాజధానిలో ప్రతిష్ఠంభన

అమరావతిలో మారని పరిస్థితులు

సిఎం ప్రకటనపై రైతుల అసంతృప్తి

'సుప్రీం'నిర్ణయంతో చిగురించిన ఆశలు



పిచ్చిమొక్కలతో నిండిన రాజధాని భూములు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టుగా ఉంది. 2019 మే 30న అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2019 డిసెంబరు17న మూడు రాజధానుల ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. దీనిపై రైతులు న్యాయపోరాటానికి దిగడంతో పాటు 1173 రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో విశాఖ నుంచి పరిపాలన చేస్తామని చేసిన ప్రకటనపై రాజధాని రైతులు మండిపడు తున్నారు. ఈ అంశం సుప్రీంకోర్టులో ఉన్నా సిఎం జగన్ ఇందుకు విరుద్ధంగా మాట్లాడటాన్ని రైతులు తప్పుపడుతున్నారు. సుప్రీంకోర్టులో ఈనెల 28 నుంచి రాజధాని అంశంపై విచారణ జరగనుంది. ఈవిచారణను ముందుగానే చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు త్రోసిపుచ్చింది. విచారణ రాష్ట్ర ప్రభుత్వం కోరుకున్నంత వేగంగా చేయలేమని సుప్రీంకోర్టు రెండు రోజుల క్రితం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయంపై రైతులల్లో ఆశలు చిగురించాయి. దీంతో ఇప్పట్లో తీర్పు వెలువడే అవకాశం లేదని స్పష్టం అయింది.

అమరావతి రైతులు రాజధాని అంశంపై మరో పిటీషన్ దాఖలుకు సన్నద్ధం అవుతున్నారు. ప్రధానంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును యథాతథంగా అమలు చేయాలని రైతుల తరుపున జెఎసి నాయకులు పిటీషన్లు దాఖలు చేయనున్నట్టు తెలిసింది. జిల్లాలో మూడున్నర ఏళ్లుగా రియల్ఎస్టేట్ వ్యాపారంలో ఏర్పడిన స్తబ్ధత ఇప్పటికీ కొనసాగుతోంది.

ఇప్పట్లో అమరావతికి భవిష్యత్తు ఉండదని రియల్టర్లు భావిస్తున్నారు. రాజధాని గ్రామాల్లో గత రెండేళ్లుగా ఏర్పడిన ప్రతిష్టంభన ఇప్పటికీ కొనసాగుతోంది. భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు తమ భవితవ్యం ఏమటని ప్రశ్నిస్తున్నారు. రాజధాని అమరావతి ప్రాధాన్యత కోల్పోయేలా చేసి తమ ప్రాంతంలో భూముల విలువను తగ్గించి తీవ్ర నష్టం చేశారని వాపోతున్నారు. రాజధానిలో గజం లక్ష పలుకుతుందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన భరోసాతో రైతులు భూ సమీకరణలో 34వేల ఎకరాలను ఇచ్చారు. నాలుగేళ్లలో పరిస్థితి తలకిందులైంది.

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచస్థాయి రాజధానిని నిర్మిస్తామంటే తాము భూములు ఇచ్చామని గత ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగా ఉండగా వాటిని కొనసాగించాల్సిన వైసిపి ప్రభుత్వం నిర్మాణాలు నిలిపివేసి మూడున్నర ఏళ్లుగా అమరావతిలో ఎటువంటి అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టకపోవడంతో రాజధాని గ్రామాల్లో క్రయ విక్రయాలు పూర్తిగా నిలిచిపో యాయి. 2014 నుంచి 2018 వరకు

2 లో



పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలువుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు

డిఇఒ వెంకటప్పయ్య మాకొద్దు

పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన

కలెక్టర్‌కు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఫిర్యాదు

డిఇఒపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ హామీ

ప్రజాశక్తి - నరసరావుపేట

ఉపాధ్యాయులను చులకనగా చూస్తూ వారి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన డిఇఒ మేకతోటి వెంకటప్పయ్య మాకొద్దు అంటూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన తెలిపారు. అనంతరం పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. అతనిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయ సంఘాల నాయకులకు కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి క్రమశిక్షణగా చూసే ఉపాధ్యాయులని జిల్లా స్థాయి అధికారి చులకనగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ప్రజాప్రతినిధులు, జడ్‌పి, మరియు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయినిలు, ప్రధానో పాధ్యాయులతో చిలకలూరిపేటలో నిర్వహిం చిన మొదటి సమీక్షా సమావేశంలో డిఇఒ మాట్లాడుతు ఉపాధ్యాయులు ఏం పీకుతారు, జీతాలు దండగ అంటూ మాట్లాడారన్నారు. అదే విధంగా అమరావతి, సత్తెనపల్లి, రెంటచింతల, వినుకొండ అనేక ప్రాంతాలలో జరిగిన సమీక్షలలో ఉపాధ్యాయుల పట్ల ఉద్రేక పూరితమైన మాటలు మాట్లాడాన్ని ఉపాధ్యాయులు ముక్తకంఠంతో ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. లోపాలు ఉంటే సరి చేయాల్సిన జిల్లా స్థాయి అధికారి పరుష పదజాలంతో మాట్లాడడం సమీక్ష మధ్యలో మూత్ర విసర్జనకు కూడా వెళ్లనీయకుండా అడ్డుపడడం సిగ్గుచేటన్నారు. డీఈఓ వైఖరి వైఖరి మార్చుకోవాలని గతంలో

2లో

---

9 నుండి ఉద్యోగుల సమస్యలపై ఆందోళనలు

- ఎపి జెఎసి రాష్ట్ర కోశాధికారి మురళీకృష్ణ

2లో

సిఎం హామీలకు కొరవడిన 'స్పందన'

8లో

విత్తన పరిశోధనా సంస్థ ఆక్రమించిన దళితుల

భూమిని రీ సర్వే చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

4లో



పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించిన గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 15వ తేది నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నందున పరీక్షలను ప్రశాంతంగా, పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 73 పరీక్షా కేంద్రాలలో 58,602 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 29,873 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 28,729 మంది పరీక్షలకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, పరీక్షా కేంద్రానికి అర్ధ గంట ముందు హాజరవ్వాలన్నారు. హాల్ టికెట్‌తో పాటు ఫోటో గుర్తింపుకార్డు తప్పక తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. ఎలాంటి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడవన్నారు. పరీక్షలకు సంబంధించి రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ (ఆర్ఐఒ) కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (0863-2228528) ఏర్పాటు చేశారని, విద్యార్థులకు ఏదైనా సందేహాలు, ఇబ్బందులు

2లో



శవపేటికతో రాస్తోరోకో చేస్తున్న మృతురాలి కుటుంబీకులు

శవపేటికతో రాస్తారోకో

పోలీసుల చొరవతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి-తెనాలి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ శనివారం తెనాలి-నారాకోడూరు రోడ్డులో అంగలకుదురు వంతెనపై బాధితులు రాస్తారోకో చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గతనెల 27న గరువుపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యవసాయకూలీలైన మహిళలు పిట్టు వెంకటరమణ, టి.సామ్రాజ్యం మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రమాదంలో గాయపడి వడ్లమూడి డివిసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాపట్ల జిల్లా, చుండూరు మండలం దుండిపాలెం గ్రామానికి చెందిన మద్దు క్రీస్తు కుమారి(42) శనివారం మృతి చెందింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబీకులు ఆందోళన చేస్తారని ముందుగానే ఊహించిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మరో మార్గంలో అంబులెన్స్‌లో మృత దేహాన్ని ఆమె ఇంటికి చేర్చారు. అప్పటికే ఆందోళనకు సిద్ధమైన కుటుంబీకులు, గ్రామస్తులు శవపేటికను బుజాలపై మోసుకుంటూ దుండిపాలెం నుంచి అంగలకుదురు కూడలికి తీసుకువచ్చారు. శవపేటికను రోడ్డుపై ఉంచి దాదాపు రెండు గంటలు రాస్తారోకో చేశారు. స్థానికంగా మంత్రి ఉండి కూడా

2లో



అధికారులతో సమీక్షా సమావేశంలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

అక్రమ మైనింగ్ అడ్డుకోవాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతున్న కార్య కలాపాలను తక్షణం అడ్డుకొని అందుకు కారణం అవుతున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని ఎస్.అర.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులో భూ గర్భ గనులు, అటవీ, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల పలు పత్రికల్లో వచ్చిన అక్రమ మట్టి తవ్వకాలు, మైనింగ్ కార్య కలాపాల కథనాల ఆధారంగా చేసిన తనిఖీలు, తీసుకొన్న చర్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పల్నాడు జిల్లలో ఇప్పటి వరకు సుమారు 750 అక్రమ మైనింగ్ కేసుల్లో రూ.8 కోట్ల అపరాధ రుసుము వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లలో మైనింగ్ ప్రాంతాలు, కొండలు,అటవీ ప్రాంతాలు ఎక్కువ ఉన్నాయని ఆ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్‌నకు అవకాశాలు ఉన్నాయని, వాటి పరిరక్షణ ప్రభుత్వ ఆదాయ వనరులను కాపడుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాల విభజన తరువాత మైనింగ్ శాఖలో సిబ్బంది కొరత ఉందని, అయినప్పటికీ అక్రమ మైనింగ్‌పై చర్యలు

2లో



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

డిఇఒ వెంకటప్పయ్య మాకొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పలు మార్లు హెచ్చరించిన్నప్పటికీ ప్రవర్తనలో మార్పు రాకపోగా ఇంకా వేధింపులు ఎక్కువ చేశారని మండిపడ్డారు. ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తనను ఏమీ చేయరని, తాను ముఖ్యమంత్రి అయితే 70శాతం వేతనాలు కోత పెడతానని అహంకారపూరితంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఫ్యాప్టో పల్నాడు జిల్లా చైర్మన్ బి.సంపత్ కుమార్ మాట్లాడుతూ డి.ఈ.ఓ గా వెంకటప్పయ్య కొనసాగితే సక్రమంగా విధులు నిర్వహించలేమని తక్షణమే డి.ఈ.ఓ ని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. తాను ఉపాధ్యాయుల దగ్గరే చదుకున్నాడని, ఉపాధ్యాయుడగా కొనసాగుతు ప్రస్తుత స్థాయికి చేరుకున్నాడన్న విషయాన్ని కూడా మరిచిపోయి మహిళా ఉపాధ్యాయినులను కూడా చులకనగా మాట్లాడం దుర్మార్గమన్నారు. తక్షణమే డిఇఒను బదిలీ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని దీనిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఈ నెల 14 న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని హెచ్చరించారు.

సమావేశంలో ఫ్యాప్టో పల్నాడు జిల్లా కార్యదర్శి అశోక్ కుమార్, ఎస్.టి.యు ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, యూటీఎఫ్ నాయకులు మోహనరావు, గఫార్, ఏపీటీఎఫ్ అధ్యక్షులు ఉస్మాన్, పి.ఆర్.టి.యు అధ్యక్షులు బంక వాసు బాబు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జి విజయ సారథి, ఏపీటీఎఫ్ పి వెంకట్ రెడ్డి, టి శివ నాగరాజు, ఎన్ టి ఏ నాయకులు సెల్వ రాజు, పి ఆర్ టి యు నాయకులు శ్యామ్ మోజేష్, ఎస్సీ ఎస్టీ సంఘం నాయకులు అగస్టస్ పాల్గొన్నారు.

సిఐటియు సంఘీభావం

ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతినేలా ఉపాధ్యాయుల పట్ల డిఈఓ అనుచిత వ్యాఖ్యలు తగదని తక్షణమే ఉన్నతాధికారులు డిఈఓపై చర్యలు తీసుకోవాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయ నాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు చేసే ఆత్మగౌరవ పోరాటానికి సిఐటియు మద్దతు ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

శవపేటికతో రాస్తారోకో

(మొదటి పేజీ తరువాయి)

బాధితులను పరామర్శించలేదని వారు విమర్శించారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అదించాలని డిమాండ్ చేశారు. ఈలోగా అక్కడికి చూరుకున్న రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు బాధితులతో చర్చలు జరిపారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని సముదాయించి ఆందోళనను విరమింపచేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆందోళన నేపథ్యంలో వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించామన్నారు. ప్రజలు ఏదైనా సమస్య ఉంటే లిఖిత పూర్వకంగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తేవాలన్నారు. అకస్మాత్తుగా రోడ్డుపై బైఠాయించి రాస్తారోకోలు చేయటంతో అత్యవసర పరిస్థితుల్లో వెళ్లే అంబులెన్సులు, పాఠశాల నుంచి ఇళ్ళకు వెళ్లే చిన్నారులు ఇబ్బంది పడతారన్నారు. గమనించి ప్రజలు సహకరించాలన్నారు.

అక్రమ మైనింగ్ అడ్డుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో చెక్‌పోస్టులు పెంచాలన్నారు. నరసరావు పేట పరిధిలో కోటప్ప కొండ వద్ద నుంచి అక్రమంగా విజయలక్ష్మి టౌన్‌షిప్‌కు తరలి పోతున్న మట్టిని తక్షణం ఆపించాలని ఆదేశించారు. బకాయిలు చెల్లించ కుండా నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రాత్రి పూట ఎక్కువగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్న దృష్ట్యా వాహనాలను నిరంతరం తనిఖీలు చెయ్యాలని ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు మైనింగ్ శాఖకు సహకరించాలన్నారు. టీమ్‌లుగా నిరంతరం పర్యవేక్షణ చేయలని అధికారులను ఆదేశించారు.

9 నుండి ఉద్యోగుల సమస్యలపై ఆందోళనలు

ఎపి జెఎసి రాష్ట్ర కోశాధికారి మురళీకృష్ణ నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎపి జెఎసి అమరావతి పిలుపు మేరకు ఈనెల 9వ తేదీ నుండి చేపట్టిన ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేయాలని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కోశాధికారి వి.వి.మురళీకృష్ణనాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఎపి జెఎసి జిల్లా ఛైర్మన్ కె.సంగీతరావు అధ్యక్షతన స్థానిక రెవెన్యూ భవన్‌లో జెఎసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇటీవల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని ప్రకటించారని, కానీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేల కోట్ల బకాయిలు మాత్రం బకాయిలు చెల్లించట్లేదన్నారు. తమకు రావాల్సిన న్యాయమైన హక్కులతోపాటు, ఒకటో తేదీన జీతం ఇవ్వాలని అడుక్కునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ.14.5వేల కోట్ల బకాయిల గురించి నోరెత్తకుండా, ఉద్దేశపూర్వకంగా జీతాలు సకాలంలో ఇవ్వకుండా మానసికంగా ఇబ్బంది పెడుతుందన్నారు. కోవిడ్‌లో ప్రాణాలకు తెగించి మా ఉద్యోగులు పనిచేశారని, జీతాలు అడిగితే మేం చెడ్డవాళ్ల అయ్యామా అని ప్రశ్నించారు.సంగీతరావు మాట్లాడుతూ



అభివాదం చేస్తున్న జెఎసి నాయకులు

గత మూడున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలను ఉద్యోగులు ప్రజల్లోకి తీసుకెళ్లారని, కానీ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యతిరేక భావం కలిగి ఉందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న ఉద్యమంలో ఈసారి వెనుకంజ వేసే ప్రసక్తే లేదన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఉద్యమం ఉంటుందని, ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అందరికీ బటన్ నొక్కుతున్న ప్రభుత్వం ఉద్యోగుల బకాయిలు కోసం బటన్ నొక్కి ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా కన్వీనర్ కిరణ్, నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు, వి.విజయ్‌కుమార్, పెన్షనర్ల సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో ప్రతిష్ఠంభన

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన క్రయ విక్రయాలతో పోల్చితే ఇప్పుడు నామమాత్రంగా కూడా లావాదేవీలు జరగడం లేదు. ఇప్పటి వరకూ చేపట్టిన అనేక నిర్మాణాలను ఎందుకు ఉపయోగిస్తారో తెలియని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కళ్ల ముందే బహుళ అంతస్తుల నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నట్టు కన్పిస్తున్నా వాటిని ఏవిధంగా ఉపయోగంలోకి తేవాలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. అఖిల భారత సర్వీసు అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు,పేదలకు నిర్మించిన అపార్టుమెంట్స్‌ను ఏ విధంగా వినియోగించాలన్నదీ ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కక్షపూరితంగా రాజకీయపరమైన నిర్ణయాలు తప్పపరిపాలన పరమైన నిర్ణయాలు లేకపోవడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు 1173 రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. భూములు ఇచ్చిన వారిలో కేవలం 29 గ్రామాల రైతులే కాకుండా రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిన వివిధ తరగతుల ప్రజలు కూడా ఉన్నారు. వీరు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. వీరికి కూడా రైతులతో సమానంగా గృహనిర్మాణ, వాణిజ్య ప్లాట్లు కేటాయించినా మౌలిక సదుపాయల కల్పన నిలిచిపోవడంతో ప్రస్తుతం క్రయ విక్రయాలు నిలిచిపోయాయి.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఎదురైనా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్టుమెంటల్ ఆఫీసర్‌ను నియమించాలన్నారు. ప్రశ్నా పత్రాల భద్రతకు స్ట్రాంగ్ రూమ్ వద్ద తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. 73 పరీక్షా కేంద్రాలకు తగినంత మంది ఇన్విజిలేటర్స్ లేనందున టీచర్లను ఏర్పాటు చేయాలని డిఇఒకు సూచించారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించడం జరిగింది. పరీక్షా కేంద్రాలలో సరైనా గాలి, వెలుతురు ఉండేటట్లు చూడాలన్నారు. సమావేశంలో ఆర్ఐఓ జి. సునీతా, డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్:అప్పులు బాధలు తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిని కౌలురైతు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కందులవారి పాలెంకు చెందిన బూతుకూరి ప్రతాపరెడ్డి (38) వ్యవసాయంలో వరుస నష్టాలు రావడంతో అప్పులు పాలయ్యాడు. అప్పులు భాదలు తాళలేక ఈ నెల 2 వతేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సత్తెనపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. సొంతపోలం 1.65సెట్లతోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పతి, మిర్చి ,మాగాణి పంటలు సాగు చేస్తున్నాడు. వ్యవసాయలో ఒడిదుడుకులు కారణంగా రూ.10 లక్షల వరకు అప్పులు అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ వేద హై స్కూల్‌లో సైన్స్ డే వేడుకలు

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్ : శ్రీ వేద హై స్కూల్‌లో సైన్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఓ రుద్రపాటి శోభాచంద్ పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన 120రకాల ప్రయోగాలను పరిశీలించి విద్యార్థులకు అభినందించారు. భవిష్యత్తులో ఇంకా మంచి ప్రయోగాలు చేసి సైన్స్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. సైన్స్ అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.తద్వారా ఈ కార్యక్రమంలో శ్రీ వేద హై స్కూల్ డైరెక్టర్ అంబటి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ ఎ. ఏడుకొండలు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు.



విదార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న శోభాచంద్



బ్రహ్మానందంను సత్కరిస్తున్న పార్ధసారధివర్మ

చదువుకు పేదరికం అడ్డు కాదు

సినీ నటుడు బ్రహ్మానందం

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్:చదువుకు పేదరికం అడ్డు కాదని ప్రముఖ సినీ నటుడు డాక్టర్ బ్రహ్మానందం అన్నారు. శనివారం రాత్రి కెఎల్ విశ్వవిద్యాలయంలో జరిగిన సమ్యక్ వార్షిక వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సాస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా సినీ నటుడు డాక్టర్ బ్రహ్మానందంను శ్రీ కెఎల్ యు చైర్మన్ శ్రీ కోనేరు సత్యన్నారాయణసాదరంగా ఆహ్వానించారు. డాక్టర్ బ్రహ్మానందం మాట్లాడుతూ తాను నిరుపేద కుటుంబంలో జన్మించానని, సత్తెనపల్లి మండలం, ముప్పాళ్ల దగ్గర ఉన్న చాగంటివారి పాలెంలో తాను చిన్న తనం నుండి ఎన్నో ఇబ్బందులను అధిగమించినట్లు తెలిపారు. పేదరికాన్ని ద్వేషించ వద్దన్నారు. పేదరికాన్ని ప్రేమించండి, ఆదరించండి అది మీకు జీవితంలో ఎన్నో పాఠాలను నేర్పుతుందంటూ బ్రహ్మానందం చేసిన ప్రసంగానికి విద్యార్థులు కేరింతలు కొట్టారు. విశ్వవిద్యాలయం ప్రో చాన్సులర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, వైస్ చాన్సులర్ డాక్టర్ .పార్థసారదివర్మ, తదితరులు పాల్గొన్నారు.

13 మంది జూదరుల అరెస్ట్

రూ.2.12 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - తుళ్లూరు: మండలంలోని ఉద్దండ రాయునిపాలెంలో పేకాట స్థావరంపై ఎస్ఈబి పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడి చేశారు. 13 మంది జూదరులను అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ 2 లక్షల 12 వేలు నగదు, 3 కార్లు, 14 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జూదరుల పై కేసు నమోదు చేశారు.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు



ప్రజాశక్తి -ప్రత్తిపాడు:బార్య కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో భర్త పిర్యాదు చేసిన సంఘటన ప్రత్తిపాడు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరల ప్రకారం ప్రత్తిపాడు మండలం మరియు గ్రామానికి చెందిన పల్లం శాంత కుమారి, భర్త జక్రయ్య, (43) అను ఆమెగత నెల 28వ తేదీ మధ్యాహ్నం 1 గంట సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయింది ఎంత వెతికినా ఆమె ఆచూకి తెలియరాలేదని ఆమె భర్త పల్లం జక్రయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్ఐ ఆరోగ్యరాజు తెలిపారు. వారికి ఒక కుమారుడు, కుమార్తె కలరు.

పెట్రోల్ బంకులో నగదు తీసుకెళ్లాడని ఫిర్యాదు

ప్రజాశక్తి -ప్రత్తిపాడు:పెట్రోల్ బంకులో పంప్ బాయ్‌గా పని చేస్తూ పెట్రోల్ విక్రయించగా వచ్చిన నగదు బంకు యజమానులకు అప్పగించకుండా అవి తీసుకొని వెళ్లి పోయాడని పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ప్రత్తిపాడు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరల ప్రకారం ప్రత్తిపాడు మండల కేంద్రంలోని శ్రీ సాయి షణ్ముఖ సీత రామ ఫిల్లింగ్ స్టేషన్ లో ప్రత్తిపాడు గ్రామానికి చెందిన తుపాకుల రాధకృష్ణ మూర్తి పంప్ బాయ్‌గా పని చేస్తున్నాడు. గత నెల 11 తేదీన బంకులో ఆయిల్ విక్రయించగా వచ్చిన సుమారు రూ.1.10వేల నగదును బంకు యాజమాన్యంకి అప్పగించకుండా ఆ డబ్బు తీసుకొని వెళ్లిపోయాడని, నేటి వరకు తిరిగి రాకపోవటంతో మేనేజర్ మాధవరపు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్ఐ ఆరోగ్యరాజు తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



ప్రజాశక్తి- మంగళగిరి రూరల్:గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ పోలీసులను శుక్రవారం ఓ ప్రేమ జంట ఆశ్రయించారు. మంగళగిరి -తాడేపల్లి నగర పాలకసంస్థ పరిధి కాజకు చెందిన బుల్లా ప్రదీప్, అదే గ్రామానికి చెందిన చింతలపూడి శైలిలు గత కొంతకాలంగా ప్రేమించుకుంటూ శుక్రవారం ఓ చర్చిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. నూతన వధూవరులు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. తమకు ఇరువురి పెద్దల నుండి రక్షణ కావాలంటూ పోలీసులను కోరారు.



రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి -దుగ్గిరాల: అక్రమంగా తరలిస్తున్న లారీ లోడ్ బియ్యాన్ని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులో తీసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడప జిల్లా పోరిమామిళ్ళకు చెందిన లారీ సిమెంట్ లోడ్‌తో విజయవాడ వచ్చింది. లారీ ఓనర్ డ్రైవర్‌కు ఫోన్ చేసి తెనాలి నుండి లోడ్ తీసుకోని తూర్పుగోదావరి జిల్లా మండపేటలో అన్ లోడ్ చేయాలని చెప్పాడు. దీంతో తెనాలిలో బియ్యాన్ని లోడ్ చేసుకుని మండపేట వెళు తుండగా పక్కా సమాచారంతో ఎస్ఐ ఎ.శ్రీనివాసరెడ్డి తన సిబ్బందితో లారీని పట్టుకున్నారు. డ్రైవర్‌ను అరెస్టు చేశారు. లారీలో 50 కేజీల బస్తాలు 360 బస్తాలు ఉన్నట్లు తెలిపారు. తెనాలికి చెందిన రైస్ మిల్ ఓనర్ కృష్ణ ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.అతనిపై కూడా కేసు నమోదు చేశారు.



రామకృష్ణాపురం వద్ద ప్రమాదంలోనుజ్జయిన కారు, మృతులు రాజ్యమ్మ, సురేష్ (ఫైల్)



ఇరుకుపాలెం వద్ద ఘటనలో మృతుడు పవన్ కుమార్

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి - ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్:కారును లారీ ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ పంచాయతి పరిధిలోని రామకృష్ణాపురం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న నాగినేని రాజ్యమ్మ (55), మేనల్లుడు నాగినేని సురేష్ (35)లు అక్కడికక్కడే మృతి చెందారు. సత్తెనపల్లి నుండి కారులో కొమెరపూడి వెళుతుండగా కంకరలోడుతో గుంటూరు వైపు నుండి సత్తెనపల్లి వస్తున్న టిప్పర్ లారీ ఎదురుగా ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఉపాధ్యాయురాలు రాజ్యమ్మ నందిగామ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతి పొంది కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. సత్తెనపల్లికి చెందిన రాజ్యమ్మ అవివాహిత కావడంతో సోదరులే ఆమె ఆలనా పాలన చూస్తున్నారు. సురేష్ పాస్టర్ ట్రైనింగ్ చేస్తున్నాడు. సురేష్‌కు భార్య యమున, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రూరల్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-ముప్పాళ్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనంపై వెళ్ళుతున్న యువకుడు మృతిచెందిన ఘటన మండలంలో ఇరుకుపాలెం గ్రామ పరిసరాలలో గల మదర్సా వద్ద శనివారం చోటుచేసుకుంది.నర్సారావుపేట బిసి కాలనీకి చెందిన జోరిగే పవన్ కుమార్ (28) బెంగుళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కంపెనీ మారేందుకు సర్టిఫికెట్లు అవసరం అవ్వడంతో తను చదువుకున్న సతైనపల్లి ధూళిపాళ్ల లోని లయోల కళాశాలలో సర్టిఫికెట్‌లు తీసుకుని ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణంలో ఇరుకుపాలెం గ్రామం మదర్సా వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు.మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం సతైనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు

ఆర్టీసీ బస్సు ఢీకొని వాహనదారునికి తీవ్రగాయాలు

మంగళగిరి రూరల్:మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఆత్మకూరు కోకోకోలా ఫ్యాక్టరీ సమీపంలో రహదారిపై ఆర్‌టిసి బస్సును ఢీకొని ద్విచక్రవాహన దారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారుడు ఓవర్ టేక్ చేయబోయి అదే సమయంలో ఎదురుగా తెనాలి నుంచి మంగళగిరి వైపు వస్తున్న మరో ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ప్రమదాదం చోటుచేసుకుంది. గాయపడిని వ్యక్తి స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ని ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-రాజుపాలెం:ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలోని ఎస్ఫ్ఎస్ స్కూల్ వద్ద శనివారం చోటుచేసుకుంది.బాపట్లకు చెందిన పేర్ల యోగేష్ గుంటూరు నుండి గురజాలకు ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో రాజుపాలెం ఎస్ఫ్ఎస్ స్కూల్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాయాలైన వ్యక్తిని 108లో సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వినుకొండ రైలు పేటలో చోరీ

నగదు, బంగారం, సెల్ ఫోన్లు అపహరణ

ప్రజాశక్తి- వినుకొండ: పట్నంలోని రైలు పేటలో చోరీ జరిగి నగదు, బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు అపహరణకు గురైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రైలు పేటకు చెందిన గుడిపాటి బ్రహ్మేశ్వర రావు పట్టణంలో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం కుటుంబ సభ్యులంతా పట్టణంలోని ఓ శుభకార్యానికి వెళ్లి తెల్లవారుజామున రెండు గంటలకు ఇల్లు చేరుకొని నిద్రిస్తున్న సమయంలో దొంగలు ఇంట్లో ప్రవేశించి హ్యాండ్ బ్యాగ్‌లో, బీరువాలో ఉన్న 20 వేలు నగదు, మాటీలు, బుట్టలు, చెవి దిద్దులు రెండు సవర్ల బంగారాభరణాలు, నాలుగు సెల్ ఫోన్లు అపహరించుకుపోయినట్లు బాధితుడు బ్రహ్మేశ్వరరావు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	90,137
మిర్చి ఎగుమతి	:	98,597
మిర్చి నిల్వ	:	73,182

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 22,800
నెం.5	16,000 - 21,000
273	16,000 - 22,000
341	10,000 - 24,000
4884	17,500 - 19,000
సూపర్ 10	20,000 - 20,400
నాన్ ఎసి	
తేజ	9,000 - 22,500
బడిగి	12,000 - 25,500
దేవనూరు డీలక్స్	11,300 - 22,500
తాలుకాయలు	5,000 - 13,000



'ప్రశ్నించే హక్కుపై ప్రభుత్వాల దాడి'

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రశ్నించే హక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయని ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య విమర్శించారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నేటి రాజకీయ పరిస్థితులు అనే అంశంపై వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసగించారు. సమావేశానికి సీనియర్ న్యాయవాది బి.శ్రీనివాసబాబు అధ్యక్షత వహించారు . అనంతరం పాములయ్య మాట్లాడుతూ దేశంలో ప్రజా రాజకీయాలు బలహీనపడ్డాయని, ఈ నేపథ్యంలో ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపిలు మేధావులను, ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెడుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. అప్రజాసౌమిక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో సిఐటియు నాయకులు పురుషోత్తం, సిపిఐ నాయకులు ఇర్మియ ,జై.భీం పార్టీ నాయకులు జె.విజయ్ కుమార్, జన విజ్ఞాన వేదిక నాయకులు ఇ.ఏడుకొండలు, బిఎస్పి నాయకులు బి.సంగీతరావు , పౌర హక్కుల సంఘం నాయకులు సి.హెచ్ కోటేశ్వరరావు , దళితమహాసభ నాయకులు కె.ఆంథోనీ, జె.పాల్ రాజ్ పాల్గొన్నారు.

'పన్ను బకాయలు వెంటనే చెల్లించండి'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణ ప్రజలు మున్సిపాలిటీ వారికి చెల్లించాల్సిన ఇంటి, నీటి పన్నుల బకాయిలు వెంటనే చెల్లించి మున్సిపాలిటి వారికి సహకరించాలని ఎస్కే రఫాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను బకాయి పడ్డ ఆయా పన్నులను వెంటనే చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.



ఎత్తిపోతల ఆశ్రమ పాఠశాలలో ఇంటర్ విద్య

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో వచ్చే ఏడాది కి ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశ పెట్టేలా కషి చేస్తానని మాచర్ల జడ్పీటీసీ సభ్యుడు మల్లుస్వామి అన్నారు.శుక్రవారం రాత్రి ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లుస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.అనంతరం పాఠశాల హెచ్ ఎం జి.దుర్గా భవాని ఆధ్వర్యంలో మల్లుస్వామిని ఘనంగా సన్మానించారు.విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా ట్రైబెల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ పి.చంద్ర రావు,తాళ్లపల్లి సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య,ఎన్ బిఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు కె.పాండునాయక్,ఎల్ఎఫ్ఎల్ హెచ్ ఎం వెంకటేశ్వర్లు, వార్డెన్ వై.వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయులు మల్లేశ్వరి, వాణి, నిర్మల, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విత్తన పరిశోధనా సంస్థ ఆక్రమించిన దళితుల భూమిని

రీ సర్వే చేయండి

- దళితులకే ఆ భూములు అప్పగించాలి
- లబ్ధిదారుల వద్ద ఆధారాలు ఉన్నాయి
- ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలి
- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-నరసరావుపేట

గురజాల మండలం చర్లగుడిపాడు గ్రామంలో సర్వే నెంబర్ 660 నుండి 686 నెంబర్ లలో దళితులకు చెందిన 90 ఎకరాల భూమిని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ విత్తన పరిశోధన సంస్థ ఆక్రమించిన భూమిని రీ సర్వే చేసి తిరిగి వాస్తవ లబ్ధిదారులైన దళితులకు అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురజాల మండలంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యా లయ అనుబంధ సంస్థ వ్యవ సాయ పాలిటెక్నిక్, విత్తన సాంకేతిక పరిశోధన స్థానం వారి ఆధ్వర్యంలో ఉన్న భూములను శనివారం పరిశీలించారు. అనంతరం చర్లగుడిపాడు గ్రామంలోని అసైన్మెంట్ భూముల లబ్ధిదారులతో ల్లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ 1978లో జంగమేశ్వర పురం గ్రామంలో విత్తన పరిశోధనా సంస్థను స్థాపించారని ఈ సంస్థకు జంగమేశ్వరపురం రెవిన్యూ గ్రామ పరిధిలో ఉన్న 380 ఎకరాల భూమిని మాత్రమే కేటాయించారని కాని పరిశోధన సంస్థ వారు అక్రమంగా చర్లగుడిపాడు గ్రామంలో దళితుల స్వాధీనంలో ఉన్న సుమారు 200 ఎకరాల భూములను కూడా ఆక్రమించారని ఆరోపించారు. ఈ భూములు తమ పూర్వీకుల స్వాధీనంలో ఉన్నాయని వాటిని తమకే కేటా యించాలని గత 20 ఏళ్లుగా చర్లగుడి పాడు దళితులు పోరాడుతున్నారన్నారు. ఈ విషయమై హైకోర్టులో కేసు వేయగా ఇటీవల లబ్ధిదారులకు అనుకూలంగా తీర్పు చెప్పిందన్నారు. 90 ఎకరాల భూమిని రెవెన్యూ వారు స్వాధీనం చేసుకొని తిరిగి దళితులకు పంపిణీ చేయాలని కోర్టు తీర్పు చెప్పిందని, దీని ఆధారంగా లబ్ధిదారులు జిల్లా కలెక్టర్‌ను, తహశీల్దార్ ను కలిసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం కలగలేదని దళిత రైతులు తమ వద్ద ఆవే దన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. లబ్ధి దారులు పేర్కొంటున్న సర్వే నంబర్లలోని భూమి ప్రభుత్వానికి చెందిందని విత్తన పరిశోధనా సంస్థకు కేటాయించలేదని సమాచార హక్కు చట్టం ద్వారా అర్జీ పెట్టగా, 2012లో అప్పటి తహశీల్దార్ సమాచారం ఇచ్చినట్లు లబ్ధి దారులు వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. విత్తన సంస్థకు సంబంధం లేని భూమిని కూడా తమదే అంటూ విత్తన సంస్థ వారు ఫెన్సింగ్ వేయ డం, ప్రహరీ కట్టడం అన్యాయమన్నారు. భూముల రీ సర్వే జరుగుతున్న సందర్భం గా విత్తన సంస్థకు కేటాయించిన భూములను విడగొట్టి, మిగిలిన ప్రభుత్వ భూములన్నిటినీ పేదలకు పంపిణీ చేయా లని డిమాండ్ చేశారు.పేదలకు భూములు దక్కాలంటే లబ్ధిదారులందరూ ఐక్యంగా పోరాటం చేయాలని ఈ సందర్భంగా చర్లగుడిపాడు అసైన్మెంట్ భూముల లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టక పోతే, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలకు ఈ భూములు పంపిణీ చేసే దాకా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు, లబ్ధిదారులు కొమ్ముల అక్కులు, పత్రా మరియదాసు, పత్రా ఆదాం పాల్గొన్నారు.



ఆక్రమణ భూములను పరిశీలిస్తున్న లక్ష్మీశ్వరరెడ్డి



నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మధు తదితరులు

దావల సముద్రయ్య మృతికి సంతాపం

ప్రజాశక్తి-నాదెండ్ల

గొరిజవోలు దళిత వ్యవసాయ సంఘం నాయకులు, భూ పోరాట నిప్పురవ్వ దావల సముద్రయ్య (85) శనివారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ రాజ్యసభ సభ్యులు మధు హాజరై సంతాపం తెలిపారు. నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజకవర్గంలో 2017 సం వత్సరంలో వేలూరు, ఎడవల్లి, తూబాడు, గొరిజోలు గ్రామాల్లో దళితుల భూములను కాజేసేందుకు టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఎంత గానో ప్రయత్నాలు చేశాయని, అప్పుడు సిపిఎం పార్టీ పోరాటాల ఫలితంగా ఆ భూములు దళితులకే దక్కాయని అన్నారు. గొరిజవోలులో దళితులు సాగు చేసుకుంటున్న 150 ఎకరాల భూమిలో 40 ఎకరాలో మంచినీటి చెరువు తవ్వగా, మిగిలిన 95 ఎకరాలు భూములను అక్కడి దళి తులు సాగు చేసుకుంటున్నారని, ఆ భూములను మట్టి తవ్వకాలు జరిపి ఎలాగైనా కాజేయాలని అక్కడి అగ్రవర్ణాల పెత్తందారుల ప్రయత్నాలను ఆ గ్రామంలో ఉన్న దావల సముద్రయ్య, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులను కలుపుకొని పోరాటాలు జరిపి ఆ భూములను నిలుపుదల చేయించారని గుర్తుచేశారు. అప్పటి నుండి వారే సాగు చేసుకుంటున్నారని, వాటికి పట్టాలను సాధించేందుకు సముద్రయ్య ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఆ ప్రాంతంలో సిపిఎం ప్రజాసంఘాల పోరాట ఫలితంగానే ఆ భూములు దళితులకు దక్కాయని మరోమారు గుర్తుచేశారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, పల్నాడు జిల్లా సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వై.రాధాకష్ణ, విజయ గోపాల్‌రావు, తోకల కోటేశ్వరరావు, కారుసోల రోసియా, ఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు.

నిమ్స్‌కు అంజంరాజు మృతదేహం

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన సరికొండ అంజంరాజు (61) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. అంజంరాజు సోద రుడు, స్థానిక భగత్ సింగ్ భవన నిర్వహణ కమిటీ సభ్యులు సరికొండ శేషంరాజు శనివారం ఈ మృతదేహాన్ని విజయవాడలోని నిమ్స్ వైద్య కళాశాలకు అప్పగించారు. తన సోదరుడి నేత్రాలను విజయవాడలోని ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేసినట్లు శేషంరాజు తెలిపారు. నిమ్స్ వైద్య కళాశాల గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రపాటి చలపతిరావు ఆధ్వ ర్యంలో కళాశాల సిబ్బంది గ్రామానికి వచ్చి అంజంరాజు మృతదేహాన్ని కళాశాలకు తీసుకెళ్ళారు. వైద్య పరీక్షల నిమిత్తం ఉపయోగపడేలా అవయవదానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కో -ఆర్డినేటర్ తెలిపారు.



పెంచిన గ్యాస్ ధరలను తగ్గించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ మేరకు శని వారం పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్, శ్రీరామనగర్‌లోనూ మహి ళలు గ్యాస్ సిలిండర్లు బయటపెట్టి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికీ పది సార్లు గ్యాస్ ధరను పెంచారని విమర్శించారు. ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ వాణ ిజ్య సిలిండర్‌కు ఏకంగా రూ.350 పెంచడం వల్ల చిరువ్యాపారులు దుకా ణాలు మూసే సుకునే పరిస్థితి ఏర్ప డిందని అన్నారు. నిత్యావసర వస్తు వులు ధరలు విపరీతంగా పెరగ డంతో చింతపం డుతో తొక్కు నూరు కునే పరిస్థితులు లేవని, మహిళలు ఏం పనులు చేసుకుని బతకాలో అర్థం కావడం లేదని, జీవనం ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ఇప్ప టికైనా ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధర లను వెంటనే తగ్గించక పోతే మహిళ లందరిని సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో గింజుపల్లి మాధవి, నాగ లక్ష్మి, తుమ్మల లక్ష్మి, రామకోటమ్మ, అంజమ్మ, లాల్ బి,లక్ష్మి, గింజుపల్లి మల్లేశ్వరి, అరుణ పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్ బయటపెట్టి నిరసన తెలిపిన మహిళలు

ఎయిమ్స్ సెక్యూరిటీ గార్డులను తిరిగి పనిలోకి తీసుకోవాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో నాయకుల డిమాండ్

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో 2019 నుండి పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ ను తొలగించడం జరిగింది. తొలగించిన వారిని పనిలోకి తీసుకోవాలని కోరుతూ ఎయిమ్స్ హాస్పిటల్ సెక్యూరిటీ గార్డ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి శనివారం తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వారిలో పదవ తరగతి నుండి పీజీ వరకు చదివిన వారు కూడా ఉన్నారని వివరించారు. ఆసుపత్రి నిర్మాణ దశ నుండి పనిచేయడం జరిగిందని తెలిపారు. రెండు కొండల మధ్య అడవి లాగ ఉండి, కష్టమైనప్పటికీ పనిచేయడం జరిగిందని తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేయడం జరిగిందని వివరించారు. ఎలాంటి నోటీసులు లేకుండా 84 మందిని తొలగించడం దారుణమని తెలిపారు. తొలగించిన స్థానంలో కొందరిని మాజీ సైనికులను తీసుకోవడం జరిగిందని తెలిపారు. జాయింట్ సూపర్డెంట్ రామ్మోహన్, సెక్యూరిటీ సూపర్వైజర్ బి హరికష్ణ వారి ఇష్టానుసారం తొలగించడం జరిగిందని తెలిపారు. తొలగించడం వలన తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని విన్నవించారు. అందువలన ఆదుకోవడానికి ఎయిమ్స్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుల గాను, అటెండర్, ఎం ఎన్ ఓ, ఎం టి ఎస్ ఇలా పోస్టులు ఖాళీగా ఉంటే వాటిల్లో ఇప్పించవలసిందిగా కోరారు. నాలుగు సంవత్సరాలు చేసినప్పటికీ ఎలాంటి నోటీసులు లేకుండా తొలగించడం



అన్యాయమని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఎస్ చెంగయ్య, సిఐటియు మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఎయిమ్స్ హాస్పిటల్ సెక్యూరిటీ గార్డ్స్ అసోసియేషన్ నాయకులు జి కోటేశ్వరావు, కే శివ శంకర్, కె బుచ్చిబాబు, కే వెంకట్రావు, ఆర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎయిమ్స్ హెచ్ ఓ డి రామ్మోహన్రావు కు వినతిపత్రం అందజేశారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఇటీవల కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం తాడేపల్లి పట్టణ కమిటీ సమావేశం దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరలు తగ్గించకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గృహ వినియోగదారులకు రూ.50, వ్యాపార అవసరాలకు వినియోగించే సిలిండర్ ధర రూ.350 పెంచడం దారుణమని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసరాల ధరలతో పాటు పెట్రో ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇది చాలదన్నట్టు వంటగ్యాస్ ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందని విమర్శించారు.బిజెపి అధికారంలోకి రాకముందు రూ.440 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1170కు పెరిగిందన్నారు. ధరలు పెంచడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. ఏడాదికి కోటి



మాట్లాడుతున్న పాశం రామారావు

ఉద్యోగాల మాట అటకెక్కి, నిరుద్యోగం పెరిందని అన్నారు. గవర్నర్లను అడ్డం పెట్టుకుని రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. రాజ్యాంగంలోని లౌకిక విలువలను మంటగలుపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధనాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి, చెత్త పన్నుల వసూళ్లు నిలుపుదల చేయాలని కోరారు. తాడేపల్లి పట్టణంలో ప్రభుత్వం భూముల్లో నివాసముంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని తాడేపల్లి పట్టణంలోని డోలాస్‌నగర్, ఇస్లాంపేట, లెనిన్‌నగర్, సుందరయ్య ప్రెస్ కాలనీ, జగజ్జీవన్‌రావ్ కాలనీ, పి.వి.నగర్, నులకపేట, లూర్ధునగర్‌లో శనివారం నాలుగు దళాలు ఇంటింటి ప్రచారం నిర్వహించాయి. కరపత్రాలు పంపిణీ చేశాయి. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేయడంలో బరితెగించి వ్యవహరిస్తోందని తీవ్ర విమర్శలు చేశారు. పాలకులు వేస్తున్న భారాలతో ప్రజల జీవన ప్రమాణాలు నానాటికీ తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి విధానాలను ప్రతిఘటించడానికి ప్రజలు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాదు, బి.ఏసయ్య, వీరయ్య, జ్యోతి, లక్ష్మి, వెంకన్న, బి.ప్రభాకర్, జి.సుంకన్న, శ్రీను, రేణుక తదితరులు పాల్గొన్నారు.



కాకుమాను తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బైరగాని శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. శనివారం కాకుమాను తహసిల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటప్పుడు రూ.400 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1200 రూపాయలకు చేరిందని, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులపై గ్యాస్ పెంపు భారం మోయలేనిదన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరగకపోయినా పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి ధరలను విపరీతంగా పెంచి సామాన్య, మధ్యతరగతి వర్గాలపై పెనుభారాలు మోపుతున్నారన్నారు. అనంతరం మండల తహసిల్దార్ కు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం కాకుమాను మండల కార్యదర్శి కందుల శ్రీనివాసరావు, కొల్లా వెంకన్న, పోతురాజు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - తెనాలి

వంటగ్యాస్ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీఆధ్వర్యంలో పట్టణంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు ధారా రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక బోస్‌రోడ్డులోని ఇందిగా గాంధి విగ్రహం వద్ద గ్యాస్ స్టౌవ్, సిలెండర్లు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి సర్కార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా పెంచి, పేదలపై భారం మోపుతోందన్నారు. పెంచిన గ్యాస్ ధర తగ్గించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దాసరి ప్రభు, మత్తే రవి, వనమా తేజ, పాముల పవన్, సంతోష్, షేక్ భాషా పాల్గొన్నారు.



కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి -మంగళగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఎస్ చంగయ్య అన్నారు. శనివారం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో ఎయిమ్స్ హాస్పిటల్ సెక్యూరిటీ గార్డ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా అసోసియేషన్ కార్యదర్శి జి కోటేశ్వరావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. చంగయ్య మాట్లాడుతు ఏప్రిల్ 5వ



తేదీన కేంద్ర కార్మిక విధానాలను నిరసిస్తూ చలో ఢిల్లీలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, అందులో భాగంగానే కార్మికులను పనిలో ఉండగానే తీసివేయడం జరుగుతుందన్నారు. ఆ విధంగా ఎయిమ్స్ లో సెక్యూరిటీ గార్డ్స్ ను తీసేయడం జరిగిందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు సంఘటితమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి, ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పర్మినెంట్ ఉద్యోగులను తీసుకోవాలని కోరారు. ఆ విధంగా చట్టంలో మార్పులు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదస్సులో సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సెక్యూరిటీ గార్డ్స్ అసోసియేషన్ నాయకులు జి కోటేశ్వరావు, పి శివశంకరరావు, ఆర్ వెంకటేష్, శ్రీరాములు, కే బుచ్చిబాబు, కే వెంకట్రావు పాల్గొన్నారు.

'సరసభారతి' ఉగాది పురస్కారానికి ఎంపికైన హకీంజాని



ప్రజాశక్తి-తెనాలి:పట్టణానికి చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజాని సరసభారితి వారి ఉగాది పురస్కారానికి ఎంపిక య్యారు. ఈమేరకు ఆయన శని వారం వివరాలను వెల్లడించారు. కృష్ణా జిల్లాకు చెందిన సాహిత్య, సాంసృతిక సంస్థ సరసభారతి ప్రతి ఏటా వివిధ రంగాల్లోని వారికి ఉగాది పురస్కారాలను పంపిణీ చేస్తుందన్నారు. ఈ ఏడాది సాహితీ రంగంలో తన 30ఏళ్ళ కృషికిగాను తనను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈనెల 19న ఉయ్యూరులో నిర్వహించే కార్యక్రమంలో ప్రముఖుల చేతులమీదుగా పురస్కారాన్ని అందుకోనున్నట్లు హకీంజాని తెలిపారు. ఇప్పటకి 1400 వ్యాసాలు, ప్రముఖ తెలుగు దిన పత్రికల ఆదివారం అనుబంధాలకు 50కి పైగా కవర్‌పేజి కథ నాలను హకీంజాని రంచించారు. అలాగే పలు పురస్కా రాలను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పట్టణా నికి చెందిన పలువురు ప్రముఖులు, సాహితీ ప్రియులు అభినం దించారు.



మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

చలో ఢిల్లీ జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి :ప్రధానమంత్రి మోదీకి రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు సత్తా ఏంటో తెలిపేందుకు ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలి రావాలని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు కోరారు. శనివారం రాజధానిలో భాగమైన పెనుమాక దాబాల సెంటర్‌లో జరిగిన రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో 65 శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయరంగాన్ని అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. మూడు నల్ల చట్టాలు, విద్యుత్ బిల్లు రద్దు కోసం సంవత్సరం పైగా రైతులు నడిపిన చారిత్రాత్మక ఉద్యమాన్ని గుర్తుచేశారు. ఉద్యమానికి తలవొగ్గిన ప్రభుత్వం చట్టాల రద్దు ప్రకటించి, నేటికీ అమలు చేయకుండా రైతులను మోసం చేసిందని దుయ్యబట్టారు. ప్రజాసంపదను పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు దోచిపెడు తోందని విమర్శించారు 2013 భూ సేకరణ చట్టం ద్వారా భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరపై నాలుగు రెట్లు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుంచనపల్లి నుండి మెల్లెంపూడి వరకు వ్యవసాయ కాలువను సర్వే చేసి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. తాడేపల్లి, కుంచనపల్లి, కొలనుకొండ రైతుల భూములపై విధించిన రిజర్వ్ జోన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. దేశభవిష్యత్ కోసం దేశ సంపద, మతోన్మాదుల చేతుల నుండి దేశాన్ని కాపాడాలని ప్రజానీకాన్ని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పీర్‌సాహెబ్, టి.బక్కిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు నిల్వలు కొనండి

ప్రజాశక్తి-తెనాలి :ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా పసుపు నిల్వలలను కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. కొల్లిపర మండలంలో పసుపు రైతులను శనివారం ఆయన కలిశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా రైతు గుదిబండి నాగిరెడ్డి నివాసంలో ఆయన మాట్లాడుతూ ఐదు వేల ఎకరాల్లో రెండు లక్షణ బస్తాలు పసుపు నిల్వలు మండలంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.6800 ధర ప్రకటించినా ఆధరకు కొనుగోలు చేసిన దాఖలాలు లేవన్నారు. దళారులు మాత్రం రూ.4600కు మించి కొనటం లేదన్నారు. దీంతో రైతులు నష్టాల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పసుపును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. సమావేశంలో మంగల కార్యదర్శి కోట చంద్రశేఖరరావు, జిల్లా కమిటీ సభ్యురాలు ములకా శివకుమారి, సీనియర్ నాయకులు గుదిబండి నాగిరెడ్డి పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన పెంపొందించుకోండి

విద్యార్థులతో 'ఏ డే విత్ కలెక్టర్' లో శివశంకర్ లోతేటి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సమాజ ప్రగతి కోసం విద్య కు ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యాన్ని విద్యార్థులు ఉపయోగించుకొని లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థానాలకు చేరి, సామాజిక సేవ చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి సూచించారు. కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో 'ఏ డే విత్ కలెక్టర్' కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. గురజాల నియోజకవర్గం పరిధిలో 9,10 తరగతులు చదవుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొని విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. తొలుత విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను అడిగి ఆయన తెలుసుకున్నారు. విద్యార్థుల్లో ఇద్దరు టీచర్లుగా, 9 మంది డాక్టర్లుగా,13 మంది సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా, ఇద్దరు సివిల్ ఇంజనీర్లుగా, 7 గురు ఐపిఎస్‌లుగా, 15 మంది ఐఎఎస్ లు గా, స్థానిక రాజకీయాల్లో ఒకరు, రాజకీయాల్లో మరొకరు, వ్యాపారం చేస్తామని ఇంకొకరు, ప్రొఫెసర్‌గా ఒకరు, సిఎలుగా ఇద్దరు, ఆర్మీ జవాన్ లు గా ఇద్దరు, ఆర్మీ ఆఫీసర్ గా ఒకరు, ఇద్దరు వ్యవసాయం, ఆర్టిస్ట్ గా ఒక్కరు, ఆర్కిటెక్చరు గా ఒక్కరు చదువులో మెలకువలు నేర్చుకొని స్థిరపడతామని కలెక్టర్ కు వివరించారు. పలువురు విద్యార్థులు తమకున్న పరిజ్ఞానంలో ప్రశ్నలు వేయగా వారికి అర్థమయ్యే రీతిలో కలెక్టర్ సమాధానాలిచ్చారు. ఆయన కలెక్టర్‌గా ఎదిగిన తీరుపై పలువురు విద్యార్థులు ప్రశ్నించారు. ఐఎఎస్ కావడానికి తాను పడిన కష్టాన్ని, ఉన్నత చదువులు చదవడానికి గల కారణాలను కలెక్టర్ వివరించారు. విద్యార్థులు వారి లక్ష్యాలకు చేరుకోవాలంటే అందుకు తగిన విధంగా అన్ని విషయాలపై పట్టు సాధించాలని వారికి సూచించారు.



ఉన్నత చదువులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పి.పి.టి) ద్వారా చూపించారు. మెదడుకు పదును పెట్టేలా, సృజనాత్మక పెంపొందించేలా విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు అడిగి చక్కని జవాబులు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు సమాజంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవడంతో పాటు, విద్యలో నైపుణ్యం సాధించాలన్నారు. వేసవి సెలవల్లో యుపిఎస్ఇ, ఎంసెట్ పేపర్లు చూడాలన్నారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకోవడం, ప్రతి రోజు పత్రికలు చదవడం అలవాటు చేసు కోవాలని, విజయం సాధించిన వారి కథలు,ఇంటర్వ్యూలు చదవాలని, ప్రతి ఒక్కరు ఉపయోగకరమైన అభిరుచులు పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. డబ్బులు వృథాగా ఖర్చు చేయకుండా పొదుపు చేయడం నేర్చుకోవాలన్నారు. ఎప్పుడూ పక్కవారితో పోల్చుకోవద్దని, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలని చెప్పారు. విద్యార్థినీ, విద్యార్థులు గొప్పగా ఎదిగి, అన్ని రంగాల్లో మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో గురజాల నియోజకవర్గం లోని మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ గురుకుల, ఉన్నత పాఠశాలు, వసతి గృహాలు, గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 70మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు.

జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి-నరసరావుపేట

నరసరావుపేట ఆర్టీసీ డిపోకు నూతనంగా మంజూరైన రెండు పల్లెవెలుగు బస్సులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఏర్పడ్డ అనంతరం వివిధ పనులపై ఇక్కడికి వచ్చే ప్రజల రాకపోకలు పెరిగాయని అన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో నరసరావుపేట-గుంటూరు రూట్ లో రెండు పల్లె వెలుగు నూతన సర్వీసులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి సురక్షితంగా గమ్యాన్ని చేరాలన్నారు.డిఎం బి.వీరాస్వామి,రీజనల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.



హాస్టల్ లో విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి నాగవెంకట లక్ష్మి

బాలికల వసతి గృహం తనిఖీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

పట్టణంలోని బాలికల వసతి గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ డి.నాగ వెంకట లక్ష్మి శనివారం తనిఖీ చేశారు. హాస్టల్ లోని పరిసరాలను, వంటశాలను ఆమె పరిశీలించారు . అనంతరం అక్కడ ఉన్న రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. తనిఖీలో పారా లీగల్ వాలంటరీ షేక్ సుభాని పాల్గొన్నారు .

మసీదు నిర్మాణానికి మెటీరియల్ బహుకరణ

ప్రజాశక్తి-రొంపిచర్ల



స్థానిక చెరువుకట్ట సెంటరులో నూతన మసీదు నిర్మాణానికి పల్నాడు జిల్లా వైసిపి యువజన విభాగంఅధ్యక్షుడు పడాల శివారెడ్డి, వారి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం మూడు లక్షల రూపాయల విలువైన మెటీరియల్‌ను బహు కరించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ముస్లింలకు చెందిన ఖబరస్తాన్ కు ప్రహరీ నిర్మిం చనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శివారెడ్డిని, ఫ్రెండ్ సర్కిల్ అబ్దుల్ రహీం, జమీర్, షఫీ, సోహెల్, రహీంను ముస్లింలు, గ్రామస్తులు అభినందించారు.

9,10వ తేదీల్లో మంచినీటి సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మంచినీటి పైపులైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 9,10వ తేదీల్లో మంచినీటి సరఫరా నిలుపుదల చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. గోవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేట బైపాస్ రోడ్డు పనుల నిమిత్తం మంచినీరు సరఫరా చేసే పైపులైన్ల అలైన్‌మెంట్ మార్పు, ఇంటర్ కనెక్షన్లు చేయాల్సి ఉన్నందున రెండు రోజులు పట్టణ ప్రజలకు మంచినీరు నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని పట్టణ ప్రజలు గమనించాలని, మంచి నీటిని నిల్వ చేసుకోవాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

'బహుముఖ ప్రజ్ఞాశాలి వెలగపూడి రామకృష్ణ'

ప్రజాశక్తి- మాచర్ల



కెసిపి సంస్థల వ్యవస్థాపకులు వెలగపూడి రామకృష్ణ బహుముఖ ప్రజ్ఞాశాలి, ఉన్నత ఆశయాలు కలిగిన వ్యక్తి అని కెసిపి జనరల్ మేనేజర్ బివిపిఎస్ చౌదరి కొనియాడారు. వెలగపూడి రామకృష్ణ 127వ జయంతి సందర్భంగా కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒక గొప్ప వ్యక్తి జీవితం భావి తరాలకు మార్గదర్శకంగా ఉంటుందని, రామకృష్ణ జీవితం కూడా అలాంటిదేనని అన్నారు. భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలన్న ఆయన తపన చివరి వరకు కొనసాగిందన్నారు కెసిపి ఎనిమిది దశాబ్దాల పోటీపడుతూ మంచి ఫలితాలను సాధిస్తున్న కెసిపి సంస్థల విజయానికి వారి క్రమశిక్షణ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సంస్థలో పనిచేస్తూ 20 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న పలువురు ఉద్యోగులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కెసిపి అధికారులు వెల్ఫేర్ వెంకటేశ్వరరావు, హెచ్ ఆర్ డిపార్టుమెంట్ ఎం. శ్రీనివాసరావు, రమణ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి-నరసరావుపేట



అంధులతో సిపిఐ నాయకులు వై.వెంకట్.

అందుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ అతిథిగృహం పక్కనే ఉన్న అంధుల పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుతున్నా రన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలు పెచ్చులూడిన తరగతి గదుల్లో అంధులు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో 150 మంది విద్యార్థులు ఉన్నారని, సదుపాయాలు లేకపోవడంతో ప్రస్తుతం 35 మందే ఉన్నారన్నారు. పాఠశాల చుట్టూ గుట్టలుగా పిచ్చి మొక్కలు ఉండడంతో విష సర్పాలకు, దోమలకు నిలయంగా మారిందన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి పాఠశాల పరిసరాలను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు.

'తిరుమల'లో షార్ట్ టర్మ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-నరసరావుపేట: మండలంలోని జొన్నలగడ్డ పరిధిలో గల తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో 5 రోజుల పాటు జరగనున్న షార్ట్ టర్మ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ శనివారం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ తెలిపారు.డేటా ప్రాసెసింగ్, సర్క్యూట్ డిజైన్ అనే అంశంపై డిపార్ట్మెంట్ ఆఫ్ ఈసీఈ ఆధ్వర్యంలో ఈ షార్ట్ టర్మ్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఈనెల 8 వరకు కొనసాగుతుందని అన్నారు. ముఖ్యఅతిథి అసోసియేట్ ప్రొఫెసర్ (ఇ.సి.ఇ) డాక్టర్ కౌశిక్ గుహ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌశిక్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ, ఈసీఈ విభాగాధిపతి, కన్వీనర్ టి.జగదీష్ పాల్గొన్నారు.



రాంసా పోటీల్లో సత్తాచాటిన ఎపిమోడల్ స్కూల్

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రమణ మేడం స్టూడెంట్స్ అసోసియేషన్ (రాంసా) ఆధ్వర్యంలో ఏడు మండలాల ప్రాంతీయ స్థాయి ప్రతిభ పోటీలను స్థానిక మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో వెనుకబడిన ఏడు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రమణ మేడం శిష్యులు ఏర్పాటు చేసిన రాంసా సంస్థ ద్వారా ప్రతిభ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఉప విద్యాశాఖ అధికారి బహుమతులు అందజేశారు. వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసినట్లు కన్వీనర్ బైరెడ్డి వెంకటరమణ తెలిపారు. గ్రామీణా ప్రాంతంలోని విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ ప్రతిభ పరీక్షలు నిర్వ హిస్తున్నామని,ప్రతి సంవత్సరం ఇలాంటి పోటీలు నిర్వహించి విద్యార్ధులను ప్రోత్సహిస్తామని కార్యదర్శి వై.చందు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి ఒంగోలు రాజు మాట్లాడుతు విద్యార్ధుల చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు లింగాల ధనలక్ష్మి, కోటనెమలిపురి జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు ఐ.వి.మోహన్‌రెడ్డి, ఏడు మండలాల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

వ్యాసరచనలో- జి. పూజిత (జడ్పీహెచ్ఎస్ పెద్దగార్లపాడు), ద్వితీయ బహుమతి ఎ.శ్రీలక్ష్మి (జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్ మాచర్ల), తృతీయ బహుమతి డి.లక్ష్మీ ప్రణతి (జడ్పీ హెచ్ఎస్, తేలుకుట్ల).**వక్తృత్వంలో-** ప్రథమ బహుమతి మానసప్రియ (ఎంపియుపిఎస్,గంగవరం), ద్వితీయ బహుమతి షేక్ సాహిన, తృతీయ బహుమతి పి.శరణ్య (జడ్‌పిహెచ్.ఎస్ గామాలపాడు) గెలుపొందారు.

క్విజ్ పోటీలో మొదటి బహుమతి గురజాల ఎపి మోడల్ స్కూల్‌కు చెందిన ఎన్. లీలా వినయ్, వెంకట నాగశతి, ఎం.నాగవైష్ణవి టీమ్, ద్వితీయ బహుమతి మాచర్ల జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ మంజుల నాగ భవాని, సొంటి షణ్ముఖ ప్రియా, కొంపెల్ల సుదీష్నా టీం, తృతీయ బహుమతి మాచవరం జడ్పీహెచ్ పాఠశాలకు చెందిన ఈ. శ్రీవిద్య, షేక్ సాజియా, ఎం గాయత్రి టీం గెలుపొందారు.





టిడ్కో గృహ సముదాయం వద్ద చెత్తాచెదారం

ప్రజాశక్తి -మంగళగిరి

పట్టణంలోని టిడ్కో గృహ సముదాయం సమీపంలో చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వస్తుంది. గృహ సముదాయంలోకి ఇప్పుడిప్పుడే జనం వచ్చి నివాసం ఉంటున్నారు. సమీపంలో చెత్తాచెదారం, మురుగు పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయి. దీంతో అనారోగ్యానికి గురవుతున్నారు. ఎక్కడెక్కడో చెత్తను తీసుకొచ్చి ఇక్కడ వేయడం వలన సమస్య ఉత్పనమవుతుందని పలువురు ప్రజల వాపోతున్నారు. బీఎండబ్ల్యూ షోరూం కూడా పక్క సందులో ఉంది. మరొక రోడ్లో సాఫ్ట్వేర్ కంపెనీలు ఉన్నాయి. ఈ దుర్వాసన వారికి కూడా వస్తుందని తెలిపారు. ఏపీఐఐసీ వారికి విన్నవిస్తే తమకు సంబంధం లేదని కార్పొరేషన్ అధికారులను అడగాలని సమాధానం చెప్పినట్లుగా గృహ సముదాయంలో ఉంటున్న నివాసితులు చెప్పారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి అక్కడ చెత్తాచెదారం మురుగు లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అమరావతి రైతు సాంబశివరావు మృతి

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్



జి. సాంబశివరావు(ఫైల్)

బేతపూడి గ్రామానికి చెందిన గైరుబోయిన సాంబశివరావు (70) శనివారం మరణించారు. మూడు రాజధానుల ప్రకటన తరువాత మానసికంగా ఎంతో కంగిపోయి అనారోగ్యం పాలై శనివారం ఉదయం 2 గంటల సమయంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సాంబశివరావు రాజధాని అమరావతికి 6.30 ఎకరాలు భూమి ఇచ్చి, అమరావతి ఉద్యమంలో ప్రతి రోజు చాలా చురుకుగా పాల్గొనేవారు. తనకు ఇద్దరు పిల్లలు ఒక కుమారుడు ఒక కుమార్తె ఉన్నారు.

విద్యార్థి దశ నుండే శారీరక దృఢత్వాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి -మంగళగిరి

విద్యార్థినిలు విద్యార్థి దశ నుండే మానసిక; శారీరక దఢత్వాన్ని పెంపొందించుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. శనివారం రాత్రి సీకే గర్ల్స్ హై స్కూల్ 41వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని ఆయన మాట్లాడుతూ సమాజంలో నేడు మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని అన్నారు. చట్టాలు ఎన్ని చేసినా ఉపయోగం ఉండటం లేదని అన్నారు. విద్యార్థినిగా ఉన్నప్పుడే సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థిని చదువుకోవాలని కోరారు. తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ కమిటీ అధ్యక్షులు సిహెచ్ కనకయ్య, సభ్యులు జే పాండురంగారావు, దామర్లకుబేర్ స్వామి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలుపుతున్న రాజవర్ధన్

రాజవర్ధన్‌కు లోకేష్ అభినందనలు

ప్రజాశక్తి - తుళ్లూరు :టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టిడిపి నాయకులు తోకల రాజవర్ధన్ శనివారం కలిశారు. యువగళం పాదయాత్ర 34వ రోజు పుంగనూరు నియోజకవర్గం కొక్కువారిపల్లిలో ప్రారంభం అవుతున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావుతో నారా లోకేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్న రాజవర్ధన్‌ను లోకేష్ అభినందించారు. అనంతరం శాలువా కప్పి సత్కరించారు.

మహిళలు అన్ని రంగాల్లో సమానం

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాధారెడ్డి, తదితరులు

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులతో సమానంగా ఉన్నారని మున్సిపల్ కమిషనర్ రాధారెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల న్యాయ సేవాధికార సంస్థ పొన్నూరు వారి ఆధ్వర్యంలో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా పొన్నూరు మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ,మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఏపీపీ కాళిదాస్ సీనియర్ అడ్వకేట్‌లు బాజీ సాహెబ్, మక్బుల్ బేగ్, శ్రీనివాసరావు, ఝాన్సీలు మహిళా చట్టాలైన ఎంసి, డివిసి, 498ఏ హక్కుల గురించి వారికి అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రాధా రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళలు అనేక రకాలుగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని దీనికి ప్రభుత్వం కూడా చేదోడుగా ఉందని ఆమె పేర్కొన్నారు. మహిళలు పురుషులతో పోటీ పడుతూ అన్ని రంగాలలో ప్రతిభను కనబరిస్తున్నారని ఏ విషయంలోనూ వారు పురుషులతో తీసి పోరని ఆమె తెలిపారు. సమాజంలో తిరిగే సమయంలో మహిళలు తగు జాగ్రత్తలు కూడా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ఎస్‌సి ప్రతినిధి పి చంద్రశేఖర్, పి ఎల్ వీలు, అంగన్‌వాడీలు, సచివాలయం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సేఫ్టీ విభాగాలతో ప్రమాదాలను అరికట్టవచ్చు



ర్యాలీ నిర్వహిస్తున్న జోసిల్ కంపెనీలోని ఉద్యోగులు

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని డోకిపర్రు జోసిల్ కంపెనీలో 52వ జాతీయ భద్రత వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత వారోత్సవాల జెండాను ఎగరవేశారు. అనంతరం ప్రత్యేక ర్యాలీని భద్రత నినాదాలు చేస్తూ నిర్వహించారు. భద్రతా ప్రతిజ్ఞ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంపెనీ సెక్రటరీ డీజీఎం ఫైనాన్స్ కోటా రఘురాం అధ్యక్ష వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ గుంటూరు ఎం. వి.శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కంపెనీలో కూడా సేఫ్టీ విభాగాలు ఉండటం వలన ప్రమాదాలను సులభంగా అరికట్టవచ్చని తెలిపారు. కర్మాగారాల్లో భద్రత కొరకు మాక్ డ్రిల్లు తప్పక జరపాలని తెలిపారు. పాఠశాలలో పలు రకాల వ్యాసరచన పోటీలు నిర్వహించి వాటిలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ అడ్వైజర్ డెవలప్‌మెంట్ యడ్లపాటి భాను ప్రసాద్, కంపెనీ ప్రొడక్షన్ ఏజీఎం షేక్ జానీ భాష, ఇంజనీరింగ్ మేనేజర్ కందుల వెంకటేశ్వరరావు, సోప్ సెక్షన్ మేనేజర్ జాగర్లమూడి శ్రీనివాసరావు, సోప్ నూడిల్ సెక్షన్ మేనేజర్ బత్తుల సురేంద్ర, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ కె నాగమల్లేశ్వరరావు, సీనియర్ అకౌంట్స్ మేనేజర్ బి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేయడమే వైసిపి లక్ష్యం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

అభివృద్ధి చేయడమే వైసిపి లక్ష్యమని,ఇప్పటంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మించిన ప్రహరీగోడలు, కారిడార్లు మాత్రమే తొలగిస్తున్నారని, వైసిపి తాడేపల్లి మండల నాయకులు మున్నగి వివేకానంద రెడ్డి అన్నారు. శనివారం ఇప్పటంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా కొంతమంది నివాసాల చుట్టూ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మించుకున్న కట్టడాలను తొలగించే కార్యక్రమాన్ని ఎంటిఎంసి అధికారులు చేపట్టారు. వెంటనే అక్కడకు చేరుకున్న జనసేన నాయకులు ఇప్పటంలో పేదల ఇళ్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేయడంతో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, మున్నంగి వివేకానందరెడ్డి గ్రామస్తులతో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఏ ఒక్కరి భూమిలోకి అంగుళం కూడా వెళ్లి తొలగించడం లేదని, ఒక్క ఇప్పటంలోనే ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారి ఇళ్లను తొలగించలేదని, ఆత్మకూరు, నూతక్కి, నవులూరు తదితర ప్రాంతాల్లో కూడా ఆక్రమణలు తొలగించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని, అన్నారు. సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ వైసిపి నాయకులు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బ్రహ్మంగరెడ్డి, లచ్చి తులసిదాసు, హరిబాబు గౌడ్ గాజుల లక్ష్మీ నారాయణ (చిన్న), లక్కాకుల రమేష్, వైఎస్సార్సీపీ సోషల్ మీడియా గుంటూరు జిల్లా కన్వీనర్ మేకా వెంకట రామిరెడ్డి, వడ్డేశ్వరం బిసి నాయకులు కె. మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), కొలనుకొండ పార్టీ కన్వీనర్ ఎన్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'మీ కుళాయి మీరే బాగుచేసుకోండి..'

తాడేపల్లిలో మొదలైన సంస్కరణలు

ప్రజాశక్తి-తాడేపల్లి



పాడైపోయిన కుళాయి

'మీ ఇంటి ముందు పాడైపోయిన పబ్లిక్ తాగునీటి కుళాయిని మీరే బాగుచేసుకోండి.. గొయ్యిని మరే తవ్వుకోని, అందుకు కావాల్సిన మెటీరియల్ కూడా మీరే తెచ్చుకోండి' అని ఎంట ఎంసి పరిధిలోని తాడేపల్లి పట్టణంలో అధికారులు స్థానికులను ఉద్దేశించి చెబుతున్న మాటలివి. పట్టణంలోని వెంకయ్య కొట్టు సెంటర్‌లో ఉన్న పబ్లిక్ కుళాయి ఇటీవల పాడైపోవడంతో మంచినీరు రావడంలేదు. స్థానిక ప్రజలు మునిసిపల్ జోనల్ కార్యాలయానికి వెళ్లి తమ ఇళ్ల ముందు నీటి కుళాయిని బాగు చేయమని అడిగారు. సుమారు 50 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నారు. ఇక్కడున్న పబ్లిక్ కుళాయి ద్వారా స్థానిక పేదలు మంచినీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. మెయిన్ లైన్ నుంచి పబ్లిక్ ట్యాప్‌కు వచ్చే దగ్గర వ్యర్థాలు అడ్డుపడి నీరు రాకుండా పంపు పాడైపోయింది. నీటికుళాయిని బాగుచేయమని అడిగిన ప్రజలకు అందుకు సంబంధించిన గొయ్యిను కూడా 'మీరే తవ్వుకోవాలి' అని ఆదేశాలు జారీ చేశారు. స్థానికులు గొయ్యి తవ్వారు. అందుకు అవసరమైన మెటీరియల్ కూడా మీరే తెచ్చుకోవాలని అధికారులు చెప్పడంతో ఆశ్చర్యపోవడం వారి వంతైంది. క్రమం తప్పకుండా ఇంటిపన్నులు చెల్లిస్తున్న తమకు మళ్లీ 'ఈ బాదుడేంటి' అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ఇరవై రోజులుగా ఆ ప్రాంతంలో మంచినీరు అందక ప్రజలు ఇబ్బందిపడుతున్నా ఇంతవరకూ అధికారులు పాడైపోయిన పబ్లిక్ కుళాయిని బాగుచేయలేదు. పట్టణంలో ఇలాంటి పరిస్థితులు నాలుగైదు ప్రాంతాల్లో నెలకొని ఉన్నాయని అధికారలు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని స్థానిక నివాసులు కోరుతున్నారు.

బాలుడి కుటుంబానికి ఎఎన్‌యు ఆచార్యుల వితరణ

అభినందనలు తెలిపిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ

ప్రజాశక్తి -ఎఎన్‌యు

హైదరాబాద్‌లోని అంబర్‌పేట 6వ నంబర్ చౌరస్తా వద్ద కొద్ది రోజుల క్రితం జరిగిన వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల చిన్నారి ప్రదీప్ ప్రాణాలు కోల్పోయిన ఘటన అందరినీ కంటతడి పెట్టిస్తోంది. బాలుడి తండ్రి బతుకు తెరువుకు నాలుగేళ్ల క్రితం నిజామాబాద్ జిల్లా నుండి హైదరాబాద్ వచ్చి వాచ్ మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.ఈ ఘటనపై దర్శకులు రామ్‌గోపాల్ వర్మ స్పందించిన తీరుతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కొద్ది మంది ఆచార్యులు మేము సైతం అంటూ బాలుడి కుటుంబానికి శనివారం రూ.1.10లక్షల ఆర్థిక సాయాన్ని ఉపకులపతి చేతులమీదుగా బాలుడి కుటుంబ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఆచార్యులు రాజశేఖర్, మధుబాబు, నాగరాజు, ఉదయ్ కుమార్ ఒక్కొక్కరూ పదివేల రూపాయలను, ఆచార్యులు వరప్రసాద మూర్తి,సునీత, హరిబాబు, సంధ్య, చెన్నారెడ్డి, పి. సిద్దయ్య, ఎ.ప్రమీల రాణి, నాగరాజు,ప్రకాశరావు, నరసారెడ్డి, సోమశేఖర్,అబ్రహం లింకన్, శ్రీనివాస రెడ్డి, నాగ కిషోర్ రెడ్డిలు ఒక్కొక్కరూ 5000 రూాల చొప్పున నగదుని మొత్తంగా రూ.1.10లక్షలను ప్రదీప్ కుటుంబానికి ఆర్థిక సాయంగా అందించారు. రామ్ గోపాల్ వర్మ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం చేసిన ఈ కార్యక్రమాన్ని సోషల్ మీడియాలో తన ట్విట్టర్ ద్వారా తెలిపి అభినందించారు.

గుండెపోటుతో మాజీ ఎంపిటిసి సురేఖ మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



తురక సురేఖ (ఫైల్)

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన టిడిపి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు తురక సురేఖ (42) శనివారం ఉదయం గుండెపోటుతో మరణించింది. ఆమెకు భర్త , కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె గత రెండు రోజులుగా అనారోగ్యానికి గురై , విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్య తీసుకుంటున్న క్రమంలో శనివారం ఉదయం గుండె పోటుతో మరణించారు.ఆమె మృతి వార్త తెలుసుకున్న సిపిఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి ,సిపిఎం గ్రామ నాయకులు మేడూరు పాములు, పల్లపాటి సుబ్బారావు, టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, టిడిపి చిర్రావూరు గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు సురేఖ నివాసంలో ఆమె భౌతికాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

అవ్వారు సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్ :



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

బాటసారులకు, పేదలకు అవ్వారు ఆదెమ్మ పేరిట అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కొనియాడారు. శనివారం అవ్వారు ఆదెమ్మ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని అవ్వారు ఆదెమ్మ సత్రంలో విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ, పేద బ్రాహ్మణులకు సంభావన, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు స్థానిక అవ్వరు ఆదెమ్మ సత్రం ఫౌండర్ ట్రస్ట్ అవ్వారు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ అవ్వారు ఆదెమ్మ సత్రంలో పేదలకు అన్నదానంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించటం ప్రశంసనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే సొంత నిధులతోపేద బ్రాహ్మణులకు నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాలు, నగదు పంపిణీ చేశారు. తొలుత అవ్వారు ఆదెమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సత్రం కార్యనిర్వహణాధికారి దుర్గాప్రసాద్ ,శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి వీరాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ బి. ప్రభాకర్ రావు , శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ఈవో టి శ్రీనివాస్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో కఠోర శ్రమ వృధా కాదు

భాష్యం ఛైర్మన్ భాష్యం రామకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు



లక్ష్యాన్ని సాధించటానికి చేసే కఠోర శ్రమ ఏనాడూ వృధా కాదని, అది ఎప్పటికైనా ఉత్తమ ఫలితాలు ఇస్తుందని, భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. శనివారం కొమ్మినేని గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో భాష్యం సాయి భగవాన్ క్యాంపస్ 9వ తరగతి విద్యార్థులకు నిర్వ హించిన ఫేర్‌వెల్ ఫంక్షన్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సం దర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉన్నత విజయాలు సాధించాలంటే ఉన్నత భావాలు, దృక్పథం ఎంతో అవసరమని, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ స్ఫూర్తిని పొంది రాబోయే భవిష్యత్ తరాలకు ఒక మంచి నమ్మకాన్ని కలిగించి, ప్రేరణగా నిలవాలన్నారు. చదువు విలువ తెలుసుకొని, కష్టపడి చదివితే భావి జీవితం ఉన్నతంగా ఉంటుందని, దీనిని గుర్తించి నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు పాల్గొన్నారు.



మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న మురళీకృష్ణ తదితరులు

ఘనంగా కళ్లం కాలేజి వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

కళ్లం హరనాధరెడ్డి ఇంజినీరింగ్ కాలేజి 12వ వార్షికోత్సవ వేడుకలు శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెఎన్‌టియు కాకినాడ విద్యా ప్రణాళిక డైరెక్టర్ డాక్టర్ కెవియస్‌జి మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు అపరిమిత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఇతర విదేశీ భాషలలో తర్ఫీదు పొంది, ఉద్యోగాలను కూడా యూనివర్సిటీ తరపున అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మెరిట్ విద్యార్థులకు ముఖ్య అతిథి చేతులమీదుగా రూ.25 లక్షల మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి వార్షిక నివేదిక సమర్పించారు. ఈ వేడుకల్లో కళాశాల ఛైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ పి.వెంకటేశ్వరరెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ యం.ఉమాశంకర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కళ్లం నవ్య, ఉపాధి కల్పన విభాగాధిపతి డాక్టర్ పియల్.మాధవరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌కు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కోయ సుబ్బారావు తదితరులు

కిట్స్‌లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

వింజనంపాడులోని కిట్స్ ఇంజి నీరింగ్ కాలేజిలో గత నెల 25వ తేదీ నుండి మార్చి 4వ తేదీ వరకూ సిఎస్‌సి విభాగానికి చెం దిన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ విద్యార్థులకు ఎలైట్‌ఎఐ స్టూడెంట్ అసోసియేషన్ తరపున ఫండమెంటల్స్ ఆఫ్ రోబోటిక్స్‌పై ఏడురోజుల పాటు ఆపిల్‌టన్ ఇన్నోవేషన్ వైజాగ్ వారి ఆధ్వ ర్యంలో వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సంద ర్భంగా కళాశాల ఛైర్మన్ కోయ సుబ్బారావు మాట్లా డుతూ మానవజీవితంలో రోబోట్స్ ప్రాముఖ్యత ఎక్కువగా ఉందని, ప్రతి అవసరానికీ రోబోట్స్‌ని వినియోగం పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ అవసరాలకు తగ్గట్టుగా అధునాతన రోబోట్స్‌ని అభివృద్ధి పరచాలని అన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు ఆర్థిక సాయం అందించటానికి కిట్స్ యాజమాన్యం సిద్ధంగా ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కళాశాల సెక్రె టరీ కెయి శేఖర్ తెలిపారు. నూతన టెక్నాలజీతో అప్లికేషన్లు తయారు చేయాలని, కళాశాల డైరెక్టర్ కె.హరిబాబు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, విభాగాధిపతి డాక్టర్ జి.మురళి అధ్యాపకులు పాల్గొన్నారు.

పూజిత స్కూల్లో వార్షిక క్రీడాసంబరాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పట్టాభిపురంలోని పూజిత స్కూల్లో యాన్యువల్ స్పోర్ట్స్‌డే ఘనంగా నిర్వ హించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు యోగా శిక్షకులు గోపవరపు వెంకటేశ్వరరావు హాజరై బహుమతులు అందచేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ అవసరమేనన్నారు. పాఠ శాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ పోటీల్లో విద్యార్థులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, త్రోబాల్, లాంగ్‌జంప్, రన్నింగ్, షాట్‌పుట్ వంటి క్రీడలు నిర్వహించారు.



విజేతలకు బహుమతి అందిస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి: జెసి

ప్రజాశక్తి-గుంటూరు



బెలూన్లు ఎగురవేసి, పోటీలను ప్రారంభిస్తున్న జెసి, తదితరులు

విద్యార్థులు నాయకత్వ లక్ష ణాలు, బృందస్ఫూర్తి, క్రమశిక్షణ, జ్ఞానం, బాధ్యతాయుతంగా, ప్రశ్నిం చేతత్వాన్ని అలవాటు చేసు కోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ రాజ కుమారి అన్నారు. స్థానిక గుం టూరు రూరల్ మండలం, పలక లూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెం డ్రోజులపాటు నిర్వహించనున్న జాతీయస్థాయి టెక్నికల్, కల్చరల్, ఫైన్‌ఆర్ట్స్, లిటరరీ, స్పోర్ట్స్‌ఫెస్ట్ 'నిరులోత్సవ్-2కే23' ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథి జేసీ మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా పనిని పూర్తి శక్తిని వినియోగించి చేస్తేనే ప్రయోజనం ఉంటుం దన్నారు. విద్యార్థులు ఎప్పుడూ సమూహంలో ఒకరిగా ఉండ కుండా పది మందికి దారిచూపే దిశలో ఎదగాలన్నారు. దేశం అభి వృద్ధి చెందాలంటే మహిళల భాగస్వామ్యంతోనే సాధ్యమన్నారు. విద్యార్థిను లు సానుకూల ఆలో చనలు, దృక్పథం కలిగి ఉండటం, కొత్త ప్రదేశాలను సందర్శించడం, ప్రకృతిని ఆస్వాదించడం వంటివి చేయడం వలన మానసికంగా ధఢంగా ఉంటారని పేర్కొన్నారు. నరసాపురం జిల్లా సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ విద్యార్థులు ఏదైనా లక్ష్యాన్ని సాధించాలని దృఢ సం కల్పంతో నిశ్చయించుకొని విల్ పవర్‌తో కష్టపడితే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. విద్యార్థులు జీవితంలో మంచి ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానాలను అది . రోహిస్తే మీకంటే నేనే ఎక్కువగా సంతోషపడతానని విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. లైఫ్‌స్కిల్స్, టీమ్ స్పిరిట్, కమ్యూ నికేషన్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్కిల్స్ వంటివి క్లాస్‌రూమ్‌తో పాటు ఆటల్లో ఎక్కువగా పాల్గొనే విద్యార్థుల్లో త్వరగా అభివృద్ధి చెం దుతాయన్నారు. అనంతరం 39 అంశాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాం స్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో నిరుల ప్రిన్సిపల్ పాతూరి రాధిక, కన్వీనర్ డాక్టర్ వి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎత్తురోడ్డు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు :మేయర్

ప్రజాశక్తి-గుంటూరు



అధికారులతో మాట్లాడుతున్న మేయర్

ఎత్తు రోడ్డు వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటు న్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలియచేశారు. శని వారం నగరం లోని ఎత్తు రోడ్డు సెం టర్ లో స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్దలు, పోలీసు అధికారులతో కలిసి పర్యటించి, ట్రాఫిక్ సమస్యకు గల కార ణాలను గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. మేయర్ మాట్లా డుతూ ఎత్తు రోడ్డు జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, సిగ్నల్స్ ఏర్పాటు, ట్రాఫిక్‌నకు అడ్డుగా ఉన్న పలు వురు నేతల విగ్రహాలను అదే ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేని ప్రాంతంలో ఏర్పాటు చేయడం, జంక్షన్‌లో ఆక్రమణల తొలగించి పూర్తి స్థాయిలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో రోజు రోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ అవ సరాల దష్ట్యా రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు తప్పనిసరిగా చేప ట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే నగరంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న పలు ప్రధాన రహ దారుల్లో రోడ్ల విస్తరణ పనులు చేపడు తున్నామన్నారు. ఇప్పటికే అడపా బజార్ నుండి వెంక టేశ్వరస్వామి గుడి వరకు ఉన్న ప్రధాన అవుట్ ఫాల్ డ్రైన్ సైజు తగ్గించి రోడ్డు విస్తరణ చేప ట్టడం వల్ల సదరు ప్రాంతంలో కొంతమేర ట్రాఫిక్ రద్దీ తగ్గిందన్నారు. త్వరలో హిం దూ కాలేజీ ట్రాఫిక్ సిగ్నల్స్ నుండి వెస్ట్ పారిష్ చర్చి వరకు రోడ్డును 120 అడుగుల మేర విస్తరించేందుకు చర్యలు చేపడ తామని, ఇరువైపులా స్థలాల యజ మానులతో సంప్రదింపులు పూర్తయ్యా యని, త్వరలోనే విస్తరణ పనులు ప్రారం భమవుతాయన్నారు. కార్పొరేటర్ ఎన్.వెం కటరమణ, ఈఈ సుందరరామిరెడ్డి, డిఈఈ రమేష్ బాబు, స్థానిక పెద్దలు సిహెచ్‌ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో ఎంఇఒ తనిఖీలు

ముగ్గురు ఉపాధ్యాయులపై చర్యలకు డిఇఒకు నివేదిక

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు మండల విద్యాశాఖ అధికారి ఖుద్దూస్ శనివారం నగరంలోని పలు పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించారు. స్థానిక సీతారమ్ నగర్‌లోని అరుంధతి ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరు ఎస్‌జిలు, యస్‌ఆర్‌ఎంఒ ఎయిడెడ్ పాఠశాలలో ఒక స్కూల్ అసి స్టెంట్‌పై చర్యలకు జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదించి నట్లు పేర్కొన్నారు. తొలుత అరుంధతి ఎయిడెడ్ ప్రాథమి కోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. 13 మంది విద్యా ర్థులుంటే వారికి చదవటం, రాయటం రావట్లేదని, ఏఒక్క సెమిస్టర్ వర్క్‌బుక్ కూడా రాయించలేదన్నారు. విద్యార్థుల సంఖ్య కంటే అదనంగా ఉపాధ్యాయులు ఉన్నం దున ఇద్దరిలో ఒకరిని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎయిడెడ్ ప్రాథ:మిక పాఠశాలకు తాత్కాలికంగా పనిసర్దుబాటు చేశారు. స్థానిక లక్ష్మీపురంలోని యస్‌ఆర్‌ఎంఒ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో బిఎస్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలు పాఠాలు బోధించ కుండా టైమ్ పాస్ చేస్తుందని, లెసన్‌ప్లాన్, టీచింగ్ డైరీ అడగగా డైరీ తన వద్ద లేదని, ఎఫ్ఎ-3, ఎస్ఎ-1 విద్యార్థుల సమాధాన పత్రాలను సరిచేయలేదని ఎంఇఒ తెలిపారు. బైజూస్ ట్యాబ్‌లను వినియోగించట్లేదన్నారు.

సిఎం హామీలకు కొరవడిన 'స్పందన'

వీక్షణం

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో సిఎం జగన్ పర్యటనల సందర్భంగా బహిరంగ సభల్లో ప్రజల సమక్షంలో ఇస్తున్న పలు హామీలు అమలుకు నోచుకోవడం లేదు. ఈ విషయంలో జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ఏమాత్రం సీరియస్‌గా స్పందించడంలేదు. గతేడాది కాలంలో పత్తిపాడు, నర్సరావుపేట, గుంటూరు, వినుకొండ, తెనాలి తదితర ప్రాంతాల్లో సిఎం జగన్ పర్యటించారు. సిఎం పర్యటనల సందర్భంగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఇచ్చిన విజ్ఞాపనల మేరకు ప్రస్తావించిన అంశాలకు స్పందించిన సిఎం జగన్ పలు హామీలు ఇచ్చి వెళ్లిపోతున్నారు. గతంలో సిఎం హామీలంటే జిల్లా అధికారులు,రాష్ట్ర అధికారులు ఎంతో వేగంగా స్పందించి అందుకు అనుగుణంగా స్పందించి ప్రభుత్వపెద్దలతో చర్చించి నిధులు తెప్పించి వీటి అమలుకు కృషి చేసే వారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా రాష్ట్ర కార్యాలయాల్లో ఫైళ్లు మూలుగుతున్నాయని ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు. గత ఏడాది జనవరి 1న పత్తిపాడు పర్యటనలో ఇచ్చిన హామీలపై తాము ప్రతిపాదనలు పంపినా ఇంత వరకు అనుమతి రాలేదని రహదారులు, భవనాల శాఖ అధికారులు చెబుతున్నారు. సిఎం ఇచ్చిన హామీల అమలుకే ఏడాదికి పైగా వేచిచూడాల్సిన పరిస్థితి వచ్చిందంటే ఇక మిగతా అభివృద్ధి పనులపై నిధులు ఎప్పటికి వస్తాయన్నదీ ప్రశ్నార్థకంగా మారింది. గుంటూరులో ఇటీవల సిఎం జగన్ పర్యటించినపుడు భూగర్భ డ్రైనేజి పనులు తిరిగి ప్రారంభిస్తామని,అరండల్‌పేట ఫ్లైవోవర్ నిర్మిస్తామని, మైనార్టీలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభిస్తామని, నగరంలో ఆర్‌యూబిలు నిర్మిస్తామని ఇచ్చిన హామీలపై ఇంతవరకు కదలికలేదు.గతేడాది ఏప్రిల్ 7న నర్సరావుపేటలో వెటర్నరీ కళాశాల, ఆటోనగర్ నిర్మాణం, మల్లమ్మ సెంటర్ నుంచి గడియారం స్తంభం వరకు ఫ్లైఓవర్ నిర్మాణంపై ఇచ్చిన హామీలపై కదలిక లేదు. వినుకొండలో ఈ ఏడాది జనవరి 30న సిఎం ఇచ్చిన హామీలపై ఇంతవరకు అధికారులు ప్రతిపాదనలే పంపలేదు. బొల్లాపల్లి మండలంలోని పలు గ్రామాలకు త్రాగునీరు సౌకర్యం రూ.12 కోట్లు, వినుకొండ పట్నంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 50 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మారుస్తామని, వినుకొండకు ముస్లిం మైనారిటీ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో గత నెల 28న తెనాలిలో సిఎం జగన్ ఇచ్చిన హామీలు ఎప్పటికి నెరవేరతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విజ్ఞాపనల మేరకు రూ.43 కోట్ల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా శిథిలావస్థకు చేరిన పురపాలక సంఘ భవన నూతన నిర్మాణానికి రూ.15కోట్లు, దళితులకు స్మశాన స్థలాలకు భూసేకరణ నిమిత్తం రూ.9కోట్లు, ముస్లిం సామాజిక వర్గం షాదీఖానా నిర్మాణానికి రూ.4కోట్లు, కొల్లిపరలో మిని మార్కెట్ యార్డు ఏర్పాటు నిమిత్తం రూ.5కోట్లు, దావులూరు-కొల్లిపర నాలుగులైన్ల రోడ్డు విస్తరణకు రూ.10 కోట్లు నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. ఇతర నియోజకవర్గాల్లో ఇచ్చిన విధంగానే తెనాలిలో కూడా హామీలు నోటి మాటలకే పరిమితం అవుతాయా,కార్యరూపం దాలుస్తాయా అన్న అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మరో ఏడాదిలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో సిఎం గత 14 నెలలుగా జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు ఇచ్చిన హామీల అమలుకు ఎమ్మెల్యేలు, జిల్లా,రాష్ట్ర ఉన్నతాధికారులు కృషి చేయాల్సి ఉంది.

ఎవిడి శర్మ